ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 07.01.2025 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ఫార్ములా-ఈ రేసు అవకతవకల కేసుకు సంబంధించి అవినీతి నిరోధక శాఖ అధికారులు హైదరాబాద్ లోని హెచ్ ఎండీఏ మాజీ కమిషనర్, హెచ్ ఎం డీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ నివాసాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు.
2. ఫార్ములా-ఈ కేసులో BRS కార్యనిర్వాహక అధ్యక్షులు, K తారక రామారావు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ ను రాష్ట్ర హైకోర్టు ఈ రోజు కొట్టివేసింది.
3. సింగరేణి సంస్థను అన్ని రంగాల్లోకి విస్తరించేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు.
4. హ్యూమన్ మెటా న్యూమోవైరస్- HMPV విషయంలో రాష్ట్ర ప్రజలు ఎలాంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నరసింహ సూచించారు.

------------------------

**ఫార్ములా-ఈ ఏసీబీ తనిఖీలు**

ఫార్ములా-ఈ రేసు అవకతవకల కేసుకు సంబంధించి అవినీతి నిరోధక శాఖ - ఏసీబీ అధికారులు హైదరాబాద్ లోని హెచ్ ఎండీఏ మాజీ కమిషనర్ అరవింద్

కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ ఎన్ రెడ్డి హైదరాబాద్ నివాసాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు.  ఈ కేసులో వారిద్దరిని ఏ2, ఏ3 నిందితులుగా ఏసీబీ చేర్చింది. ఏ1గా మాజీ మంత్రి తారక రామారావు పేరును చేర్చింది. కాగా, ఈ ఉదయం నుంచి  గ్రీన్ కో కార్యాలయాల్లో కూడా  ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్, విజయవాడ, మచిలీపట్నం ఆఫీసుల్లో ఏకకాలంలో ఈ సోదాలు కొనసాగుతున్నాయి . గ్రీన్ కో అనుబంధ సంస్థ ఏస్ నెక్ట్స్ జెన్‌లోనూ ఏసీబీ అధికారుల సోదాలు చేపడుతున్నారు.

**(పీటీసీ, హైదరాబాద్, డీఎస్)**

---------------------------

**ఫార్ములా-ఈ రేసు -హైకోర్టు:**

ఫార్ములా-ఈ రేసు అవకతవకల కేసుకు సంబంధించి, రాష్ట్ర మాజీ మంత్రి, BRS కార్యనిర్వాహక అధ్యక్షుడు K తారక రామారావు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ ను తెలంగాణా హైకోర్టు ఈ రోజు కొట్టివేసింది. రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ -ACB తనపై నమోదు చేసిన కేసును కొట్టివేసేలా ఆదేశాలివ్వాలని కోరుతూ తారక రామారావు ఈ పిటిషన్ దాఖలు చేసుకున్నారు. ఈ విషయమై వాదోపవాదాలు విన్న హైకోర్టు ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది.  ఇలా ఉండగా, హై కోర్టు ఈ రోజు తీర్పు వెలువరించనున్న నేపథ్యంలో, ఫార్ములా-ఈ రేసు ఆరోపణల విషయమై ED విచారణకు హాజరుకాలేననీ, మరో తేదీని ప్రకటించాల్సిందిగా కూడా తారక రామారావు కోరారు.

**(MSL)**

-------------------------------

**హరీశ్ రావు-కేటీఆర్**

కాగా మరోవైపు ఏడాది పాలనలోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేకత ఎదుర్కోంటోందని బీఆర్ఎస్ నేత హరీశ్ రావు విమర్శించారు. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను, ప్రజల దృష్టిని మళ్లించడానికే ఫార్ములా-ఈ కేసు వ్యవహారాన్ని తెరపైకి తెచ్చిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి మళించే, కక్ష పూర్తిత రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇందులో భాగంగానే తమ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావును ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

**----------------బైట్ .. హరీష్ రావు--------------**

**(డెస్క్)**

------------------------------

**సింగరేణి**

సింగరేణి సంస్థను అన్ని రంగాల్లోకి విస్తరించేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు, సంస్థ ఆధ్వర్యంలో అనేక వినూత్న కార్యాచరణలు అమలు చేయనున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. కేవలం బొగ్గు ఉత్పత్తుల వరకు మాత్రమే పరిమితం కాకుండా సోలార్, పంప్డ్ స్టోరేజీ ప్లాంట్లు, థర్మల్ విద్యుత్ రంగం, క్రిటికల్ మినరల్స్ మైనింగ్ తదితర రంగాల్లోకి విస్తరించేలా ప్రణాళికలు

రూపొందించినట్లు తెలిపారు. సింగరేణి సంస్థ గత ఏడాది కాలంలో సాధించిన ప్రగతిని ప్రతిబింబించేలా రూపొందించిన కొత్త క్యాలెండర్ ఉప ముఖ్యమంత్రి ఈ రోజు సింగరేణి సంస్థ హైదరాబాద్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ క్యాలెండర్ సంస్థ విశిష్టతను మాత్రమే కాకుండా, ఉద్యోగుల శ్రేయస్సు కోసం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అందరితో పంచుకోవాలనే లక్ష్యాన్ని ప్రతిబింబిస్తుందని ఆయన అన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని, సంక్షేమాన్ని, గత ఏడాదిగా జరిగిన అభివృద్ధి కార్యక్రమాలతో క్యాలెండర్ రూపొందించినట్లు సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ ఉప ముఖ్యమంత్రికి వివరించారు. 42 వేల మంది సింగరేణి ఉద్యోగులందరికీ ఈ క్యాలెండర్ ను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

**(పీఎస్)**

-------------------------------

**ఖమ్మం-విక్రమార్క**

ఖమ్మం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. ఈరోజు ఖమ్మం జిల్లాలోని ఎర్రుపాలెం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఉపముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. మీనవోలు గ్రామంలో 18 కోట్ల రూపాయలతో ఆర్ అండ్ బి రహదారి విస్తరణ పనులు, 21 లక్షల రూపాయలతో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, మధిర నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని ప్రధాన రహదారులకు అనుసంధానం చేస్తూ పక్క రహదారులను నిర్మిస్తున్నట్లు చెప్పారు.

**(PTC , Khammam)**

---------------------------

**TIMS:**

హైదరాబాద్ లోని ఆల్వాల్ TIMS ఆసుపత్రి నిర్మాణ పనులు త్వరలో పూర్తి చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిచనున్నట్లు రోడ్లు భవానాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట రెడ్డి చెప్పారు. ఈ ఉదయం ఆయన ఆల్వాల్ TIMS ఆసుపత్రి నిర్మాణ పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా విలేకరులతో మంత్రి మాట్లాడుతూ, ఈ ఏడాది డిసెంబరు నాటికి సనత్ నగర్, LB నగర్, అల్వాల్ లో చేపట్టిన TIMS ఆసుపత్రుల నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని అన్నారు. ఆల్వాల్ TIMS పనులు 90 శాతం వరకు పూర్తయ్యాయని, వివిధ విభాల సమన్వయంతో నిర్వ్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

**MSL**

---------------------------------

**సిరిసిల్ల-ఎస్పీ**

మావోయిస్టు పార్టీలో  ఉన్న రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందినవారు, జనజీవన స్రవంతిలోకి రావాలని కోరుతూ, పోలీస్ సూపరింటెండెంట్ అఖిల్ మహాజన్ “పోరు కన్నా ఊరు మిన్న – మన ఊరుకి తిరిగి రండి“ అనే కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో కౌన్సిలింగ్ సెషన్ ఏర్పాటు చేశారు. ఇటీవల

జనజీవన స్రవంతిలో కలిసిన , మావోయిస్టు నాయకురాలు రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం కు చెందిన నేరెళ్ళ జ్యోతి అలియాస్ జ్యోతక్కతో సరెండర్ అయిన వారికీ ప్రభుత్వం అందించే పునరావాసం, ఇతర సదుపాయాలు మొదలైన వాటి గురించి వివరించారు.

**(పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా)**

--------------------------

**బీజేపీ-కాంగ్రెస్**

కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీపై బీజేపీ నేత రమేష్ బిదూరి అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని యూత్ కాంగ్రెస్ నేతలు ముట్టడించారు. రమేష్ బిదూరి దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. బీజేపీ కార్యకర్తలు ప్రతిఘటించడంతో ఆ ప్రాంతంలో ఘర్షణ వాతావరణం ఏర్పడింది. ఈ ఘటనలో పలువురికి గాయాలు అయ్యాయి. పోలీసులు కల్పించుకొని ఇరు వర్గాలను చెదరగొట్టే ప్రయత్నం చేశారు.

**(డెస్క్)**

-------------------------------

**సంగారెడ్డి-కలెక్టర్**

సంగారెడ్డి జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి మండల అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రజా పాలనలో 3 లక్షల 18 వేల 775 దరఖాస్తులు రాగా , నిన్నటి వరకు 2 లక్షల 84 వేల 605

దరఖాస్తులు సర్వే పూర్తి చేశారు. సొంత స్థలం ఉన్న అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను ప్రాధాన్యాతా క్రమం లో మంజూరు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

**(SANGAREDDY. PTC )**

---------------------------------

**సంగారెడ్డి-పీఏసీఎస్**

సంగారెడ్డి జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(PACS) పదవీకాలం వచ్చే నెలలో పూర్తికానుండంటంతో కొత్త సంఘాల ఏర్పాటుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో ఇప్పటికే 53 సహకార సంఘాలు ఉండగా. కొత్తగా 7 సహకార సంఘాలు ఏర్పాటు కానున్నాయి. దాంతో సంఘాల సంఖ్య 60 కి చేరనుంది. 2013 నుంచి కొత్త సహకార సంఘాల ఏర్పాటు లేకపోవడంతో రైతులు రుణాలు, ఎరువుల విక్రయాలు, ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఇబ్బంది పడుతున్నారు. కొత్త సహకార సంఘాలతో రైతుల సమస్యలు తీరనున్నాయి.

**(SANGAREDDY. PTC)**

-------------------------------

**HMPV–రాజనర్సింహ్**

హ్యూమన్ మెటా న్యూమోవైరస్- HMPV విషయంలో ఎలాంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రజలకు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ

నరసింహ సూచించారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు, వనరులతో రాష్ట్రం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ, ఇతర రాష్ట్రాల సమన్వయంతో రాష్ట్ర ప్రభుత్వం వైరస్ పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తోందని అన్నారు. ఈ పరిణామాలపై ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయడానికి రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారులు కేంద్ర అధికారులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నారని తెలిపారు. ఈ వైరస్ విషయంలో ప్రజల్లో అనవసర భయాన్ని కలిగించే తప్పుడు, ధృవీకరించని సమాచారాన్ని సామాజిక మాధ్యమాల్లో వ్యాప్తి చేయవద్దని సూచించారు. ఇలాంటి చర్యలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని హెచ్చరించారు.

**(ఎంఎస్ఎల్)**

------------------------------

**నిర్మల్-సీతక్క**

నిర్మల్ చరిత్రపై పరిశోదనలు జరిపి భవిష్యత్ తరాలకు తెలియజేసేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పంచాయతీ రాజ్, శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు.నిర్మల్ జిల్లా కేంద్రంలో నిన్న రాత్రి నిర్మల్ ఉత్సవాలలో పాల్గొని మాట్లాడారు సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి తెలియచెప్పేందుకు ఇటువంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకోవడం గొప్ప విషయం అని తెలిపారు. నిర్మల్ పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు.  ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్ అధికారులు పాల్గొన్నారు.

**(పిటిసి నిర్మల్ జిల్లా)**

-------------------------

**సిరిసిల్ల-ఓటరు జాబితా**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ రెండు శాసనసభ నియోజకవర్గాల్లో 'మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ఈ మేరకు జిల్లా తుది ఓటరు జాబితాను కలెక్టర్, ఎన్నికల అధికారి, సందీప్ కుమార్ ఝా విడుదల చేశారు. సిరిసిల్ల, వేములవాడ, రెండు సెగ్మెంట్లలో 4 లక్షల 76 వేల 435 మంది ఓటర్లు ఉన్నారు.

**(పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా)**

-------------------------------